క్లుప్తంగా

నేరప్రవృత్తికి దూరంగా ఉండాలి



బైండోవర్ కేసులపై మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ లావణ్య

పూసపాటిరేగ: నేరప్రవృత్తికి దూరంగా ఉండాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ పి. లావణ్య సూచించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఎక్సైజ్ కేసుల్లో ఉన్న పలువురిపై బైండోవర్ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నేర ప్రవృత్తికి దూరంగా ఉండి భవిష్యత్‌కు బంగారుబాటలు వేసుకోవాలన్నారు. భోగాపురం ఎస్‌ఈబీ ఎస్సై బి. రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైఎస్సార్ కిట్ల పంపిణీ



అంగన్‌వాడీ కిట్లు దింపిస్తున్న సీడీపీఓ ప్రసన్న

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మెలో ఉన్నప్పటికీ లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ కిట్లను సోమవారం సరఫరా చేసింది. ఈ కిట్లను అంగన్‌వాడీ కేంద్రాలకు అర్బన్ సీడీపీఓ ప్రసన్న, సూపర్‌వైజర్ అనురాధ దగ్గరుండి మరీ కేంద్రాలకు చేరవేశారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు కిట్లు అందజేశారు.

అటవీ భూమి ఆక్రమణ..?



అటవీశాఖ భూమిలో నిర్మించిన లేఅవుట్ ప్రహరీ

నెల్లిమర్ల: మండలంలోని కొత్తపేటలో అటవీ భూమిని ఓ రియల్టర్ ఆక్రమించుకున్నాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ ప్రైవేట్ లే అవుట్ వారు అటవీ హద్దు దాటి ప్రహరీ వేశారు. అటవీ అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రామారావును ప్రశ్నించగా.. ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇదే కాకుండా ఈ ప్రాంతంలో చాలా అటవీ భూమి ఆక్రమణకు గురైందని.. దానిని రక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం టౌన్: ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియాది కీలకపాత్ర అని ఎస్పీ ఎం.దీపిక అన్నారు. వాజీ చానల్ ప్రచురించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ నాణ్యమైన, నమ్మకమైన, పారదర్శక వార్తాప్రసారాలను అందించే మీడియా ఎప్పుడూ సమాజంలో ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో వాజీ చానల్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతినీడి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

గుర్ల: మండలంలోని పాలవలస ఉన్నత పాఠశాల నుంచి స్కూల్ గేమ్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు 29 మంది, జాతీయ స్థాయి పోటీలకు ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం కె.సుందరమ్మ సోమవారం తెలిపారు. రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు 16 మంది, హా కీ పోటీలకు 13 మంది, జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థిని కోడి దీపిక , హైజంప్ పోటీలకు పొట్నూరు హేమలత ఎంపికయ్యా రు.విద్యార్థులను వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు సన్యాసినాయుడు అభినందించారు. వచ్చే ఏడాది జనవరి నెలలో నిర్వ హించే రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు వెళ్లడానికి విద్యార్థులకు ప్రయాణ ఖర్చుల నిమిత్తం సన్యాసినాయుడు ఆర్థిక సహాయం అందజేశారని హెచ్‌ఎం చెప్పారు.

త్రోబాల్ పోటీలకు చింతలపేట విద్యార్థులు

బాల,బాలికల విభాగాల్లో రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు చింతలపేట హైస్కూల్ విద్యార్థులు ఏడుగురు ఎంపికయ్యారని పీఈటీ కె.లక్ష్మణ్ సోమవారం తెలిపారు. కె.మురళి, వి.భార్గవ్, ఎం.మణికంఠ, బి.మురళి, ఎం.యమున, ఎస్.జ్యోతిసాయి, జి.లావణ్య జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయికి అర్హత సాధించారని చెప్పారు.ఈనెల 20,21న విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించే పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను హెచ్‌ఎం గౌరీదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

అభివృద్ధితో పాటు ప్రజారోగ్యానికి ప్రాధాన్యం



బయో రెమిడీయేషన్ లెగసీ వేస్ట్ ల్యాండ్ పునరుద్ధరణ పనులు పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులు

• డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: నగర అభివృద్ధితో పాటు సంపూర్ణ పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. గుణుపూరుపేట డంపింగ్‌యార్డు వద్ద రూ. 15 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన బయో రెమిడీయేషన్ లెగ్గసీ వేస్ట్ ల్యాండ్ పునరుద్ధరణ ప్రక్రియను సోమవారం ప్రారంభించారు. నగరంలో పేరుకుపోయిన చెత్తాచెదారాలను ప్రత్యేక పారిశుధ్య వాహనాలలో గుణుపూరుపేట డంపింగ్ యార్డుకు తరలించే విషయం అందరికీ తెలిసిందే. డంపింగ్ యార్డ్ ప్రాంతాన్ని మరింత పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు, ఎప్పటి నుంచో పేరుకుపోయిన చెత్తాచెదారాలను వేరుచేసే బృహత్తర కార్యక్రమానికి కార్పొరేషన్ అధికారులు శ్రీకారం చుట్టారు. 15వ ఆర్థిక సంఘం నిధులు 15 కోట్ల రూపాయలు వెచ్చించి చెత్త వర్గీకరణ యంత్రాలతో పాటు భూమి చదును చేసే ప్రక్రియను సోమవారం నుంచి ప్రారంభించారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయాయాదవ్, కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు, తదితరులు లెగ్గసి వేస్ట్‌ల్యాండ్ ప్రక్రియ విధానాన్ని పరిశీలించారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ, నగరాన్ని సంపూర్ణ పారిశుధ్యంగా తీర్చిదిద్దాలన్న ఆలోచనలతో అనేక విధానాలను అవలంభిస్తున్నామన్నారు. ఇప్పటికే నగరంలో సేకరించిన చెత్తను మధురవాడ వద్ద నున్న రీసైక్లింగ్ కేంద్రాలకు తరలిస్తున్నామన్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనలతో చెత్తను తరలించే వాహనాలను ఇప్పటికే ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రస్తుతం గుణుపూరుపేట వద్ద 16 ఎకరాల డంపింగ్ యార్డ్‌లో చెత్తను వర్గీకరించి భూమిని చదును చేసే ప్రక్రియ ప్రారంభం కావడం సంతోషంగా ఉందన్నారు. ఇందుకోసం భారీ యంత్రాలను తీసుకువచ్చినట్లు చెప్పారు. నగరంలో కాలువలను పరిశుభ్రంగా ఉంచడంతో పందుల సంచారం బాగా తగ్గిందన్నారు. కార్యక్రమంలో వివిధ డివిజన్‌ల కార్పొరేటర్లు, ఇన్‌చార్జ్ ఈఈ దక్షిణామూర్తి, ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యం

• మేయర్ వెంపడాపు విజయలక్ష్మి

విజయనగరం: రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలన్నదే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. ఆరోగ్యశ్రీలో సమూల మార్పులు తీసుకువచ్చే విషయమై తాడేపల్లి నుంచి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చేసిన ప్రసంగాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ విజయలక్ష్మి, తదితరులు తిలకించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ, ఆరోగ్యశ్రీ పరిధి రూ. 25 లక్షలకు పెంచినట్లు చెప్పారు. సమావేశంలో కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్, ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్, కార్పొరేటర్లు కంటుభుక్త తవిటిరాజు, మారోజు శ్రీనివాసరావు, ధనలక్ష్మి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.



విజయనగరం: ముఖ్యమంత్రి వీడియో కాన్ఫెరెన్స్‌లో పాల్గొన్న నగర మేయర్, డిప్యూటీ మేయర్, అధికారులు



విజయనగరం రూరల్: వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం ప్రసంగం వీక్షిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ, తదితరులు

ఆరోగ్యశ్రీ పేదలకు వరం : ఎంపీపీ మామిడి అప్పలనాయుడు

విజయనగరం రూరల్: పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ పథకం పేద, మధ్య తరగతి ప్రజలకు వరమని విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. తాడేపల్లిలో ఆరోగ్యశ్రీ పథకంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌ను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ, అధికారులు వీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీపీ అప్పలనాయుడు మాట్లాడుతూ, ఆరోగ్య శ్రీ పథకాన్ని రూ. 25 లక్షలకు పెంచుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంటా వెంకటరావు, ఈఓపీఆర్‌డీ డి.తిరుపతినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి

• ఎంపీపీ మహంతి కల్యాణి

పూసపాటిరేగ: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజాసంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నారని ఎంపీపీ మహంతి కల్యాణి అన్నారు. మండలంలోని పతివాడ సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు అందించిన సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించడంతో పాటు పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నాలుగున్నరేళ్లుగా రాష్ట్రం అన్నివిధాలుగా అభివృద్ధి చెందుతోందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం జగన్ మోహన్ రెడ్డిని మరోసారి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.అప్పలనాయుడు, ప్రజాప్రతినిధులు పిన్నింటి నారాయణరావు, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావుతో పాటు గ్రామానికి చెందిన పలువురు పాల్గొన్నారు.



పతివాడలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తున్న ఎంపీపీ కల్యాణి , తదితరులు

23న సామూహిక సత్యనారాయణ వ్రతాలు

నెల్లిమర్ల: కొత్తపేట గ్రామ పంచాయతీ పరిధి చిన్న అన్నవరంలోని శ్రీ రమా సహిత వీరవెంకట సత్యనారాయణ స్వామి ఆలయంలో ఈనెల 23న సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కొండేటి సురేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏకాదశి పర్వదినం సందర్భంగా నిర్వహించనున్న వ్రతాల్లో పాల్గొనదలచిన భక్తులు 21వ తేదీలోగా ఆలయంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు ఆలయ అర్చకులను సంప్రదించాలని కోరారు.

పర్యావరణ సమతుల్యతతో భవిష్యత్

డెంకాడ: భారతదేశ భవిష్యత్ పర్యావరణ సమతుల్యతతో ముడిపడి ఉందని హైదరాబాద్ ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ కేవీఎల్ సుబ్రహ్మణ్యం అన్నారు. చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో అటల్ ఫ్యాకల్టీ డవలెప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా స్థిరమైన పదార్థాలు, నిర్మాణ పద్ధతులు, ప్రస్తుత పరిస్థితులపై సోమవారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిర్మాణ రంగంలో అనేక అంశాలను ఆధారంగా చేసుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వైఎంసీ శేఖర్, కోఆర్డినేటర్ పి.మార్కండేయ, హెచ్‌ఓడీ మురళీసాగర్ వర్మసాగి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

22న మెగాజాబ్ మేళా

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 22వ తేదీన మెగాజాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రావాడ సత్యనారాయ ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. హెటిరో, అపోలో, మెడీప్లస్, డెక్కన్, కోజెంట్ తదితర 9 రకాల కంపెనీలతో పాటు ఐసీఐసీఐ బ్యాంకులో ఉద్యోగాల కోసం ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పదోతరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, బీఎస్సీ కెమిస్ట్రీ, ఎంఎస్సీ కెమిస్ట్రీతో పాటు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన 18 నుంచి 40 ఏళ్ల మధ్య ఉన్న స్త్రీ, పురుషులు అర్హులని తెలిపారు. అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్య షష్ఠి



పూల్‌బాగ్‌లో ఉన్న ఆలయంలో ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీవల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

విజయనగరం టౌన్: శ్రీవల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి మహోత్సవాలు జిల్లా కేంద్రంలో అంగరంగ వైభవంగా జరిగాయి. స్థానిక పూల్‌బాగ్‌లో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ఆలయ వ్యవస్థాపకుడు కర్రి వెంకటరమణ సిద్ధాంతి ఆధ్వర్యంలో విశిష్ట పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు వందలాది మంది భక్తులు వేకువజాము నుంచే బారులు తీరారు. సాయంత్రం స్వామివారి కల్యాణం వైభవంగా చేపట్టారు. అదేవిధంగా కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ వద్దనున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ రెయ్యి శంకరరెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి అర్చకుడు సోమశేఖరశర్మ నేతృత్వంలో పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. సిటీ బస్టాండ్ వద్దనున్న అభయాంజనేయస్వామి ఆలయంలో కొలువైన స్వామివారికి అర్చకుడు వీకే గాయత్రీశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, స్వామివారిని దర్శించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అంకితభావం కలిగి ఉండాలి



ఉపాధ్యాయులు, వలంటీర్లతో విజయ చిహ్నం చూపిస్తున్న ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఆచార్య

• లీడ్ ఇండియా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎన్‌వీ సుదర్శన్ ఆచార్య

విజయనగరం టౌన్: దేశం పట్ల అంకితభావం కలిగిన విద్యార్థులను తయారుచేయాలని లీడ్ ఇండియా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎన్.బి.సుదర్శన్ ఆచార్య అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో లీడ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఎంపిక చేసిన 440 మంది విద్యార్థులను చేంజ్ ఏజెంట్స్‌గా మార్చేందుకు పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఫౌండేషన్ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో లీడ్ ఇండియా ప్రతినిధులు బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పథకం పనులకు శంకుస్థాపన



వాటర్ ట్యాంకు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ జగ్గుబాబు, గ్రామపెద్దలు

వేపాడ: మండలంలోని పెదకృష్ణరాజపురం పంచాయతీ శివారు గదబవలస గ్రామంలో ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేసే పథకం పనులకు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సర్పంచ్ ముమ్మలూరి జగ్గుబాబు సోమవారం శంకుస్థాపన చేశారు. గదబవలస గ్రామ గిరిజనుల తాగునీటి సమస్య పరిష్క రించేందుకు రూ.35.20 లక్షల జలజీవన్ మిషన్ పథకం నిధులతో పదివేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకు నిర్మించడంతో పాటు ఇంటింట కుళాయి లు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన చెప్పారు. స్థానిక నాయకులు కిలపర్తి మురళీకృష్ణ, సత్తిబాబు, రామారావు, కృష్ణ, బి.వెంకటరావు, వై.చక్రపాణి, జి.బుచ్చిబాబు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమం



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

• ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల: రాష్ట్రంలోని ప్రతి గడపకూ సంక్షేమం అందించడమే లక్ష్యంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల నగర పంచాయతీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు ఆధ్వర్యంలో పట్టణ పరిధిలోని ఏడో వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నదీ, లేనిదీ ఎమ్మెల్యే ఆరాతీశారు. పథకాల ద్వారా ఎంతమేరకు లబ్ధి పొందారో వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా ప్రాధాన్యం ఇస్తోందన్నారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, నగర పంచాయతీ ఇన్‌చార్జ్ కమిషనర్ విశ్వేశ్వరరావు, వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి గంటా సతీష్, కౌన్సిలర్లు చిక్కాల సంతోష్ కుమార్, మైపాడ ప్రసాద్, మొయిద శ్రీనివాసరావు, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నౌపడ శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ మజ్జి గణేష్, సచివాలయ కన్వీనర్ రవ్వా నాని, పైల మురళి, బూర సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



33వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, తదితరులు

• ఆరు డివిజన్లలో రూ.80 లక్షలతో పనులు

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనులకు సంబంధించిన శంకుస్థాపన కార్యక్రమాలు పండగ వాతావరణంలో కొనసాగుతున్నాయి. నగరంలోని వివిధ డివిజన్ల పరిధిలో రూ.80 లక్షలతో చేపట్టబోయే పనులను నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్, స్థానిక కార్పొరేటర్లు సోమవారం శంకుస్థాపనలు చేశారు. ఇందులో భాగంగా 13, 33, 42, 43, 45 ,46 డివిజన్ల పరిధిలో కాలువలు, రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేయగా.. మరికొన్ని ప్రాంతాల్లో నిర్మాణాలు పూర్తియిన రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా 33వ డివిజన్ కార్పొరేటర్ జీవీ రంగారావు, వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ మారం బాలబ్రహ్మారెడ్డి మాట్లాడుతూ, నగరాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అభినందనీయుడన్నారు. గతంలో నగరాభివృద్ధిని విస్మరించిన నాయకులకు ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ హయాంలో జరుగుతున్న అభివృద్ధి పనులు కనువిప్పు లాంటివన్నారు. శివారు ప్రాంతాల్లో సైతం అభివృద్ధి పనులు చేపడుతూ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్న ఘతన కోలగట్లకు చెందుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్, వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ ప్రధాన కార్యదర్శి ముద్దాడ మధు, గదుల సత్యలత, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు ఇసరపు రేవతీదేవి, పిన్నింటి కళావతి, దాసరి సత్యవతి, తాళ్లపూడి సంతోషికుమారి, బొద్దూరు గోవిందమ్మ, తదితరులు పాల్గొన్నారు.

చేనేత హస్తకళలను ప్రోత్సహించాలి



ప్రదర్శనలో చీరలను పరిశీలిస్తున్న నగర మేయర్ విజయలక్ష్మి

• మేయర్ వెంపడాపు విజయలక్ష్మి

విజయనగరం: చేనేత హస్తకళలను ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని విజయనగరం మేయర్ వెంపడాపు విజయలక్ష్మి పిలుపునిచ్చారు. పట్టణంలోని లయన్స్ కమ్యూనిటీ హాల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన చేనేత హస్తకళ ప్రదర్శనను ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, ప్రాచీన కాలం నుంచి చేనేత హస్తకళలు మన దేశ నాగరికతకు చిహ్నంగా నిలుస్తున్నాయన్నారు. స్వతంత్ర ఉద్యమంలో చేనేత వస్త్రాలు ప్రధాన పాత్ర పోషించాయని తెలిపారు. హిందూ సంప్రదాయాన్ని ప్రతిబింబించే హ్యాండ్‌లూమ్ వస్త్రాలను ధరించి చేనేత కార్మికులకు అండగా నిలవాలన్నారు. ప్రభుత్వపరంగా చేనేత సంక్షేమానికి విశేషంగా కృషి చేస్తున్నామని చెప్పారు. చేనేత హస్త ప్రదర్శన నిర్వాహకుడు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని ప్రముఖ చేనేతలైన పొందూరు, వెంకటగిరి, పోచంపల్లి, చీరాల, సిరిసిల్ల, ధర్మవరం, తదితర ప్రాంతాల నుంచి వస్త్రాలు, చీరలు, కొండపల్లి బొమ్మలు, నక్కపల్లి, సారంగ్‌పూర్ చెక్క బొమ్మలతో పాటు మహిళలకు గాజులు, అలంకార సామాగ్రి ప్రదర్శనలో ఉంచినట్లు తెలిపారు. ఈ ప్రదర్శనను ప్రతిఒక్కరూ సందర్శించి విజయవంతం చేయాలని కోరారు.

పాత నేరస్తుడు అరెస్ట్

విజయనగరం క్రైమ్: జిల్లా కేంద్రంలో మూడు చోరీలకు పాల్పడిన పాత నేరస్తుడుని అదుపులోకి తీసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ, ద్వారపూడి గ్రామానికి చెందిన బెల్లాన బాలరాజు చెడు వ్యసనాలకు లోనై దొంగతనాలకు అలవాటు పడ్డాడన్నారు. పట్టణంలోని కేఎల్ పురం రాధాకృష్ణా మందిరం, గోకపేట పైడితల్లి అమ్మవారి గుడి, కేఎల్.పురం యాతపేటలో ఒక ఇంట్లో దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. కేఎల్ పురం కోవెల్లల్లో దొంగతనానికి పాల్పడడంతో సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. మూడు దొంగతనాలకు తానే పాల్పడినట్లు నిందితుడు ఒప్పుకున్నాడన్నారు. నిందితుడి నుంచి రూ.3,500 నగదు, పావుతులం బంగారం, 15 తులాల వెండి వస్తువులను రికవరీ చేశామన్నారు. కేసు ఛేదనలో క్రియాశీలకపాత్ర పోషించిన ఎస్సై గోపాలరావు, హెచ్‌సీ ఎం.అచ్చిరాజు, శ్రీను, శివ, శంకర్, గౌరీశంకర్‌లను సీఐ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు (వెనుక ముసుగులో నిందితుడు)